# Govt. College Autonomous, Rajahmundry

# ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తి

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 19 - Issue. 10 - Spl. Edition - October 2022 - ISSN No. : 2456-4702

రెండు రోజుల
జాతీయ సదస్సు
21 - 22 అక్టోబర్ 2022







# దళిత సాహిత్యం - తాత్త్విక దృక్పథం

## Dalit Literature - Philosophical Perspective







నిర్వహణ :

తెలుగు మరియు తత్త్వశాస్త్ర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో

ప్రభుత్వ కళాశాల స్వయంప్రతిపత్తి

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

Website : www.gcrjy.ac.in

BHAVAVEENA *Spl. Issue*
Vol. 19, Issue. 10, October 2022 (Spl. Issue)
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

# బోయి భీమన్న నాటకాలు - దళిత అభ్యున్నతి

- డా॥ టి. ఆశీర్వాదం, తెలుగు అధ్యాపకులు, పి.ఆర్. ప్రభుత్వ కళాశాల (అ), కాకినాడ.

కవిత్వం ఒక కళ అని, అది జన్మతః స్వతస్సిద్ధంగా మానవునికి ఉపలబ్ధమయ్యే ప్రతిభా విశేషమని భీమన్న విశ్వాసం. తెలుగు సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలు ఉన్నాయో, ఎన్ని ఉద్యమాలు తలెత్తాయో, కవిత్వం ఎన్ని వైవిధ్యాల్ని వెలార్చిందో అన్నింటిలో భీమన్న గారు సిద్ధహస్తులు. ఆయన పద్యం రాసినా, వచన కవిత్వం రాసినా, గేయం రాసినా దళిత అభ్యున్నతి కాంక్షించారు.

వేదాలన్నా అవి ప్రవచిస్తున్న జ్ఞానమన్నా భీమన్నకు ఎంతో ఆదరం మరియు ఎంతో గౌరవం. పురాణాల్లో, ఇతిహాసాల్లో మహర్షులు చెప్పిన కథలు కేవలం కల్పనలు కావనీ, స్వార్థపరుల వ్యాఖ్యానాల వల్ల అవి రకరకాల స్వప్రయోజనాలకూ, అజ్ఞాన తిమిరాలకూ దారి తీసినవని భీమన్న గారు తలంచారు. మిడిమిడిజ్ఞానంతో వేద విహితాలైన ధర్మా చరణాలను వ్యాఖ్యానించకూడదనీ, ఆయన తమ నాటకాలలో వెల్లడించారు. వాల్మీకి, రాగవాశిష్టం, బాలయోగి మొదలైన నాటకాల పీఠికల్లో ఆయన తన ఆలోచనలకు ప్రాతిపదికలు మనకు లభిస్తాయి.

భీమన్న సాహిత్య వ్యక్తిత్వం కవిత్వాధీనం వారి కవితలు, పద్యకావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు వెలయిస్తున్నప్పుడు మనకు కనిపిస్తాయి. ఆయన కున్న స్వేచ్ఛా ప్రవృత్తి నాటక రచనలో మరో రూపంలో మనకు ప్రతిబింబిస్తుంది. ఆయన తన నాటక సన్నివేశ కల్పనలలో, పాత్రల సృష్టిలో ప్రతి విషయంలో ఆయన తన సిద్ధాంతాలకు అనుగుణంగా కొన్ని కట్టుబాట్లను ఏర్పరచుకుంటారు. ఒక సిద్ధాంతాన్ని ప్రతిపాదించడానికి ప్రతీకాత్మకమైన పాత్రలను సృష్టించి విజ్ఞాన స్ఫోరకాలైన సన్నివేశాలను సృష్టించి ఆలోచనాత్మకాలైన సంభాషణలను కల్పించి నాటకం రాయడంలో భీమన్న గారు సిద్ధహస్తులు. సాంఘిక నాటకాల కంటే పౌరాణిక నాటకాలలో ఆయన తన దళిత అభ్యున్నతి దృక్పథం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. భీమన్న నాటకాలలో వాచికాభినయానికి, ఇతర అభినయ విశేషాల కంటే విశేష ప్రాముఖ్యం ఉండడం గమనార్హం.

భీమన్న నాటకాలలోని వాచికాభినయం ఆ పాత్రల సంభాషణరీతి, అర్థవంతమైన వాక్యాలు సామాజికులను ఇట్టే ఆకట్టుకుంటాయి. పరిసరాలనూ, వాటిని ప్రభావితం చేస్తున్న పరిస్థితులనూ అవగాహన చేసుకోగల లోకజ్ఞత పుష్కలంగా ఉందని భీమన్న తన సాంఘిక నాటకాల ద్వారా తెలియజేస్తాడు.

భీమన్న గారి 'కూలిరాజు' ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకున్న ప్రగాఢ నమ్మకానికి, విశ్వాసానికి ప్రతీక. హింసను ప్రతీకారాన్నీ, దౌర్జన్యాన్ని, పారద్రోలి, సంఘటిత శక్తికి మరింత బలాన్ని చేకూర్చగలిగితే బడుగు వర్గాల చేతిలోకి ప్రభుత్వం వచ్చి తీరుతుందని భీమన్న అభిప్రాయం.

'కూలిరాజు' నాటకం పేరు చాలా చక్కగా కుదిరింది. అంటే కూలీవాడు ప్రభువు కావడం. ఈ నాటకంలో సంభాషణలు ఎంతో ఉత్కంఠను కల్గిస్తూంటాయి. ప్రయోజనాత్మకమైన ఈనాటకం గ్రామీణ జీవనంలో ఎంతో సంస్కారాన్ని కల్గించగలుగుతుంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఈ నాటకంలో ఒకటుంది. అది ప్రణయకలాపం. అయితే ఇది చాలా సముచితంగా అభ్యుదయ మార్గంగా చిత్రించబడింది.

భీమన్న 'వాల్మీకి' ఆరు అంకాల నాటకం. ఈ నాటకంలోనూ కుల తత్త్వ వాదులు సృష్టించిన కొన్ని అపవాదాలను ఖండించడం భీమన్న ఆశయముగా పెట్టుకున్నారు. ఆదికవి వాల్మీకి హృదయంలో కవితావిర్భూతి జరిగిన మహాద్భుత క్షణాలు ఈ కావ్యంలో

అంకాలై అవతరించిన్నాయి. దీనిలో ఇతి వృత్తం సీతావనవాసం, లవకుశలుల జననం దాకా సాగింది. ఈ నాటకంలో పాటలు, పద్యాలు, రామాయణ శ్లోకాలు అక్కడక్కడ మనకు వినిపిస్తాయి. ఇందులోని పద్యాలు, పాటలు, మాటల కంటే ఎక్కువ రసానుభూతికి కారణ మవుతాయి. ఇది భీమన్న తెలిసి చేసినపని అని నేనను కుంటున్నాను. ఇలా రాయాలంటే కొంత కవితా వాసన అవసరం. ఈ నాటక కర్త ప్రకారం వాల్మీకి శప్తుడైన వ్యాధుడుగా పుట్టిన ఋషి. కవి పుడతాడే కాని ప్రయత్న పూర్వకంగా కాలేడని ప్రాచీనాలంకారికుల విశ్వాసం. ఈ నమ్మకం భీమన గారిలో గట్టిగా వుంది.

భీమన్న గారు రాసిన నాటకం 'అసూయ' నాటిక నేటికీ ప్రజా జీవితాన్ని పీడిస్తున్న జాడ్యాలు ఈ నాటకంలో చక్కగా చిత్రించబడ్డాయి. ఇది "విద్యార్థి కాంగ్రేసోద్యమ" నాటకం అని ఆయనే పేర్కొన్నారు. రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో ఈ నాటకం నర్మగర్భంగా తెలియజేస్తుంది.

"సత్యమును నసత్యముగ చూపజాలు నొకడు
లేని అపవాదు లెన్నో కల్పించు నొకడు
మంచి వానిని పడద్రోయ నెంచు నొకడు
మానవత్వము నాశనమయ్యె నేడు" అంటూ

సత్యము అసత్యముగా చూపుతూ రాజకీయ రంగంలో విద్యార్థులు ప్రవేశించడం ఎంత అనర్థానికి దారి తీస్తుందో తెలియజేస్తూ, రాజకీయ నాయకులు తమ ప్రాబల్యం కోసం విద్యార్థులను పాచికలుగా ఉపయోగించుకునే తీరుతెన్నులు ఇందులో కనిపిస్తాయి.

భీమన్న మేధావిత్వం విద్యార్థులలోని నిర్మాణాత్మక శక్తులను ఆనాడే గుర్తించగలిగింది. నీరసమైన రాజకీయ ఇతి వృత్తాన్ని భీమన్న మృదుమధుర గీతాలతోనూ చైతన్య పూరితమైన ప్రబోధ గీతాలతోనూ మనోహరంగా తీర్చి దిద్దినారు.

'స్వేచ్ఛాజీవి' విహరింపుము, మా
బానిస బ్రతుకులు తరియంప" అని

ప్రయాణానికి ప్రతీకగా కవుల కున్న కోకిల ఉద్దేశించి ఒక గీతంలో ప్రబోధాన్ని ధ్వనింపజేసినారు.

భీమన్న రాసిన విజ్ఞాన ప్రదమైన నాటకం 'రాగవాసిష్ఠ' ఈ నాటకంలోని పీఠిక చదువుతుంటే ఇదేదో కొత్త మతాన్ని కవి ప్రతిపాదిస్తున్నాడే అని అనిపిస్తుంది. కానీ నాటకం పేరులోని 'రాగం' రసాన్ని సూచిస్తుంది.

ఈ నాటకంలో అరుంధతీ వశిష్ఠులు తప్ప అన్నీ కల్పిత పాత్రలే. పరమ శివుని పాత్ర జ్ఞానానికి చిహ్నంగా నిలుస్తుంది.

"ప్రేమ ప్రేమ అంటే, విశ్వమానవ కళ్యాణాన్ని కోరేదే
ప్రేమ! దాని సిద్ధకోసం చేసే నిష్కామకర్మ
యజ్ఞం. వసిష్ఠా! నీది ప్రేమ కాదు, వట్టి కామం
దానికి ప్రేమ అని పేరు బెట్టి ప్రేమను
అవమానించకు" అంటూ

విశ్వమానవ కళ్యాణభావం ఔదార్యం, వాంఛ విలుప్తమైన నిష్కామకర్మ నీకు మోక్షాన్ని ఇస్తుందని చెబుతూ నేనిప్పుడు కోరేది వాంఛా మధురమైన రసానుభూతి అన్నాడు.

"ప్రాచీన ధర్మం కంటే ఈ ఇసుక కొంత మెత్తనిది అని చెప్తూ... "మాతంగ కన్య తేజస్వాలిని ఎందుకు కాకూడదు?" అని ప్రశ్నిస్తాడు. మానవ కల్పిత కులానికి ఆధ్యాత్మిక మహాశక్తి ముడిపెడుతున్న ఈ ప్రాచీన మతం ఎంత సత్యదూరం" మొత్తానికి నాటక కర్త భీమన్న తాను నమ్మిన సిద్ధాంతాన్ని చాలా సుందరంగా ప్రతిపాదించ గలిగినారు.

అజ్ఞానం నిరక్షరాస్యత చీకట్లలా సమాజంలో అల్లుకొని పోతున్న రోజుల్లో వీరేశలింగం పంతులు బ్రహ్మసమాజాన్ని స్థాపించి కులమతాల అడ్డు గోడలను, మూఢ విశ్వాసాల ఎండమావులనూ ఛేదించుకుంటూ కలాన్ని ఆయుధంగా పట్టి సంఘ సంస్కరణోద్యమాన్ని సాగించారు. కాని నేటికి కూడా ఆయన ఆశయాలు సంపూర్ణంగా నెరవేరినట్లు కనబడదు. మనకు రాజకీయ స్వేచ్ఛలేనప్పుడు ఆయన

సాగించిన తపస్సు ఇప్పుడు మనకు అన్ని విధాలా స్వాతంత్ర్యమున్నా సాధించలేక పోతున్నాం.

భీమన్న ఈ వైఫల్యంలో సతమతమై గ్రామీణ వాతావరణాన్ని "పాలేరు"అనే నాటకంలో భూమికగా పెట్టుకొని సజీవ పాత్రలనూ వాస్తవికమైన పరిసరాలనూ సృష్టించి కొంత త్యాగం, కొంత జ్ఞానం ఉంటే సర్వతోముఖ వికాసం సాధ్యమే అన్న ఆశావాదానికి సాధువాదం పలికినారు. ఈ నాటకంలోనూ భీమన్న తన కవితా కౌశలానికి పని కల్పించుకున్నారు.

ముమ్మిడివరం బాలయోగి జీవితాన్ని ఇతి వృత్తంగా తీసుకొని "బాలయోగి' నాటకం రాసారు. ఈ బాలయోగి నాటకం అస్పృశ్యతను నివారించడానికి వెలువడినది. తాను ఫలానా కులం వాణ్ణి చెప్పకుని సంఘంలో ఉత్తముడిగానో నీచుడిగానో మన్నన పొందడం గొప్పకాదు. ముమ్మిడివరం బాలయోగి మాలవాడు అంటే ఎవరు నమ్ముతాడు? మాలతనం మాదిగతనం, బ్రాహ్మణత్వం వీటికి అతీతమైన వ్యక్తిత్వాన్ని ఆయన తన తపశ్చర్యవల్ల సంపాదించుకొని బ్రహ్మస్వరూపుడైన తర్వాత కూడా ఆయన మాల వాడని అనడం అంతసబబైన విషయం కాదు. భీమన్న ఈ నాటకం రాసి కులం కాదు గుణం ప్రధాన మని నిరూపించినారు.

ఈ విధంగా భీమన్న గారు వారు రాసిన నాటకాల్లో సందర్భానుసారంగ దళిత అభ్యున్నతిని కాంక్షించారు.

**ఆధార గ్రంథాలు :**

1) పద్మ భూషన్ డా॥ బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - డా॥ భీమశింగి నమశ్శివాయ
2) పాలేరు నుంచి పద్మ శ్రీ వరకు బోయి భీమన్న - హైమవతి,1978 హైదరాబాద్
3) తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి
4) బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - కొల్లాగుంట ఆనందన్

❖❖❖

అక్టోబర్ 2022

# రెండు రోజుల జాతీయ సదస్సు

భావవీణ ప్రత్యేక సంచిక

21 - 22 అక్టోబర్ 2022

# దళిత సాహిత్యం - తాత్త్విక దృక్పథం

## Dalit Literature - Philosophical Perspective




## ప్రభుత్వ కళాశాల స్వయం ప్రతిపత్తి

రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.